క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళాలు అందుకుంటున్న టీటీడీ సేవా ట్రస్ట్ సభ్యుడు పారినాయుడు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దాతలు విరాళం చేశారు. డాక్టర్ జి.కామశాస్త్రి, విజయలక్ష్మి దంపతులు సహా జి.సత్య నారాయణ, సుభద్రమ్మ దంపతులు చెరో లక్ష రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఇదిలా ఉండగా, పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో పలువురు దాతల నుంచి రూ.1.40 లక్షల విరాళంను ట్రస్ట్ సభ్యులు సేకరించినట్లు టీటీడీ సేవా ట్రస్ట్ సభ్యుడు డి.పారినాయుడు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినది తీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో మూడురోజులుగా లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఆలయ నిర్వాహకులు చెలికాని వెంకట గోపాలకృష్ణ దంపతులు ఆదివారం సమకూర్చిన 100 రకాల పిండివంటల సారె స్వామివారికి అర్చకులు సమర్పించారు. వార్షికోత్సవంలో వందలాది మంది అర్చకులు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

పార్వతీపురంటౌన్: శక్తి యాప్‌తో మహిళలకు భద్ర త లభిస్తుందని శక్తి టీం ఏఎస్సై శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని బాలి కల వసతిగృహంలో గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగా హన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి మహిళ, విద్యార్థిని, బాలికలు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని చైతన్యవంతులు కా వాలని పిలుపునిచ్చారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు దాడుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు ప్రభుత్వం తెచ్చిన శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచనం లాంటిదన్నారు. ఆపదలో ఉన్న మహిళలను రక్షించే క్రమంలో ప్రతి మహిళకు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష!



నీరు తాగుతున్న పశువులు

- వేసవిలో మూగజీవాలు అనారోగ్యం బారినపడే అవకాశం
- ముందస్తు జాగ్రత్త వహిస్తే ముప్పు నుంచి బయటపడొచ్చు
- పశుపోషణ, సంరక్షణలోనూ జాగ్రత్తలు తప్పనిసరి
- ఎండ, వేడిగాలులు లేని ప్రదేశంలో పశువులను ఉంచాలి

గరుగుబిల్లి:

వేసవిలో మూగజీవాల సంరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల కారణంగా అవి అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని, తద్వారా వాటిని నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పశుపోషకులు, పాడి రైతులంతా తమ వద్ద ఉండే ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు వంటి పశు సంపదను కాపాడుకోవాలని చెబుతున్నారు. సాధారణంగా 18 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతేనే పశువులు అస్వస్థతకు గురై, పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటాయి. ప్రధానంగా వడదెబ్బకు గురైన పశువులు ఒక్కోసారి మృత్యువాత పడే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో పాడిరైతులు కొన్ని మెలకువలు పాటిస్తే చాలు వేసవి వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవచ్చని పశువైద్యాధికారులు సలహా ఇస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా..

పశువులు మేతకు పొలాలకు వెళ్లేటప్పుడు అధిక వేడిని తట్టుకోలేక అవి వడదెబ్బకు గురవుతుంటాయి. ఎక్కువ సమయం ఎండలో ఉండడం, తాగునీరు పూర్తిస్థాయిలో లభించకపోవడం వల్ల అవి తీవ్ర అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడి వేగం బాగా పెరిగి, తద్వారా చెమటలు ఎక్కువగా పడుతుంటాయి. కొన్ని సందర్భాల్లో పశువులు అపస్మారక స్థితికి చేరుకుని తీవ్ర అనారోగ్యానికి గురవుతాయి. పశువులకు వడదెబ్బ తగిలినట్లు గుర్తిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి గానీ పశువుల శాలకు గానీ తరలించాలి. ఆ తర్వాత చల్లని నీటితో శరీరమంతా కడగాలి. అనంతరం తాగునీరు పట్టించి ప్రథమ చికిత్స అందించాలి. మేతకు పశువులను తీసుకువెళ్లాలనుకునే వారు ఉదయం 11 గంటల లోపు పశువులతో ఇంటికి చేరేలా చూసుకోవాలి. అలాగే సాయంత్రం 4 గంటల తర్వాత పశువులను మేతకు తీసుకువెళ్లి, వర్ష సూచన ఉంటే వర్షం వచ్చేలోగా ఇంటికి పశువులను తీసుకురావాలి.

పగలు పచ్చిగడ్డి.. రాత్రి ఎండుగట్టి పెట్టాలి..

వేసవిలో పశువులు మేతను తక్కువగా తీసుకుని, నీటిని ఎక్కువగా తాగుతాయి. పశువులు తాగే నీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఆహార విషయంలోనూ జాగ్రత్తలు పాటించాలి. పగటిపూట పచ్చగడ్డి పెట్టాలి. రాత్రిపూట ఎండుగడ్డి పెట్టాలి. తీవ్రమైన ఎండల సమయంలో పశువులను చల్లని ప్రదేశంలో ఉంచాలి. –ఎం.శ్రీరాములునాయుడు, అసిస్టెంట్ పశువైద్యాధికారి, రావివలస

చెలరేగిపోతున్న వేటగాళ్లు..

- మృత్యువాత పడుతున్న వన్యప్రాణులు



ఘనసర – కోసలి సమీపంలో వేటగాళ్ల చేతిలో హతమైన వన్యప్రాణి

భామిని: మండలంలో విస్తరించిన తివ్వా కొండల నుంచి తాగునీటి కోసం పల్లపు ప్రాంతాలకు వస్తున్న వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. కొండల నుంచి దిగి వచ్చిన కొండమేకలు, దుప్పిలు, అడవి పందులను వేటగాళ్ల నాటు తుపాకులు, బర్రెలు, కర్రలతో దాడి చేసి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. కొద్ది నెలల్లోనే పదుల సంఖ్యలో వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడినట్లు సమాచారం. ఇటీవల ఘనసర సమీపంలోని గిరిజన ప్రాంతాల్లో వన్యప్రాణాలను వేటాడినట్లు పలువురు బహిరంగంగా చెబుతున్నారు.

‘ఉపాధి’ బిల్లులు చెల్లించండి

జియ్యమ్మవలస రూరల్: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే చెల్లించాలని వేతనదారులంతా కోరుతున్నారు. ఎండలో కష్టపడి పనిచేస్తే వారాల తరబడి బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి డబ్బులపై ఆధారపడి జీవించే తమకు ఇలా డబ్బులు ఇవ్వకుండా ఉంటే ఎలా ప్రశ్నిస్తున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పటి బిల్లులు అప్పుడే అందేవని, ఇప్పుడు నెలలు గడుస్తున్నా ఉపాధి పని డబ్బులు బ్యాంకుల్లో పడడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఎప్పటికప్పటి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న సంఘ ప్రతినిధులు

భామిని: మండలంలోని బత్తిలిలో గల ప్రాథమిక పాఠశాలలో ఒడియా విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఈ పరీక్ష నిర్వహించింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓటీఏ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సుశీలా, ఎస్.రాజశేఖర్, తదితరులు అందజేశారు.

● పొంచి ఉన్న ప్రమాదం..



పాలకొండ – వీరఘట్టం రహదారిలో నవగాం సెంటర్ వద్ద ఓ చెట్టు ప్రమాదకరంగా మారింది. చెట్టు పూర్తిగా ఎండిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి సోమవారం ఇక్కడే వారపు సంత నిర్వహిస్తారు. అటు సమయంలో చెట్టు కూలిపోతే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– పాలకొండ

● వితరణ



పాలకొండ పట్టణానికి చెందిన సుమారు వంద మంది పేదలకు లలితా రైస్ బ్రాండ్ ప్రతినిధులు ఆదివారం గొడుగులు, పాదరక్షలు వితరణగా అందజేశారు. వెంకటరాయుని కోనేటిగట్టుపై పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రంథాలయం వేదికగా స్థానిక సాహితీ సుధా డవలప్‌మెంట్ సొసైటీ నేతృత్వంలో కోటదుర్గ డిస్ట్రిబ్యూటరీ యూనియన్ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దాతలు రాజు, వారణాశి లక్ష్మణరావు, టంకాల ప్రసాద్, కొత్త గున్నేశ్వరరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ నిర్వాహకులు ఎస్‌వీ ప్రసాద్, తిరుమలరావు, చక్రవర్తి, తదితరుల నేతృత్వంలో పేదలకు అన్నదానం నిర్వహించారు.

– పాలకొండ రూరల్

● నీటి తొట్టెలు ప్రారంభం..



పాలకొండ మండలంలోని వాటపాగు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పశువుల తాగునీటి తొట్టెలను స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదివారం ప్రారంబించారు. అలాగే గ్రామంలో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ప్రారంభించి, ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, బొమ్మాళి భాను, జాడ శ్రీధర్, వాకముడి అనిల్, వావిలపల్లి రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ

దండాలమ్మ.. నూకాలమ్మ..

- పాచిపెంటలో ప్రారంభమైన అమ్మవారి ఘటాల ఊరేగింపు
- మే 12,13,14 తేదీలలో పండుగ
- 14 ఏళ్ల తరువాత నిర్వహణ



గ్రామంలో ప్రారంభమైన ఘటాల ఊరేగింపు

పాచిపెంట: మండల కేంద్రంలో నూకాలమ్మ తల్లి పండగకు సర్వం సిద్ధమైంది. సాధారణంగా ప్రతి పదేళ్లకు ఒక్కసారి జరిగే ఈ పండగను ఈ సారి పధ్నాలుగు సంవత్సరాల తరువాత నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 12,13,14 తేదీలలో పండగ జరగనున్న నేపథ్యంలో ఆదివారం అమ్మవారి ఘటాల ఊరేగింపు జరిగింది. ఘటాల ఊరేగింపుతో పండుగ ప్రారంభమైనట్లు భక్తులు భావిస్తారు. పండగవరకు అమ్మవారి ఘటాలు నెలరోజుల పాటు గ్రామంలోని వీధుల్లో తిరగనున్నాయి.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేస్తున్నారు.

అంగరంగవైభవంగా నిర్వహించేందుకు

అమ్మవారి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు, యువత, భక్తులు సమాయత్తమయ్యారు. వేలసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఘటాల ఊరేగింపు ప్రారంభమవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు తమ బంధువులు, స్నేహితలకు పిలుపులు పెట్టి తగు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

హక్కులపై అవగాహన అవసరం

పార్వతీపురం రూరల్: ప్రతిరోజూ మనకు కావాల్సిన వస్తువులను వివిధ దుకాణాల నుంచి కొనుగోలు చేస్తుంటాం. అలాగే పలు సంస్థల నుంచి ఆర్థిక, వైద్య, ఇతర సేవలు పొందుతుంటాం. కొన్ని సందర్భాల్లో నాసిరకం వస్తువులు, సేవలపట్ల తీవ్రస్థాయిలో నష్టపోతాం. కొన్న వస్తువులు, సేవల్లో లోపాలు తలెత్తినప్పుడు వినియోగదారుల కార్యాలయం దృష్టికి తీసుకువెళ్తే పరిహారం పొందే అవకాశం ఉంటుంది. ప్రజలు వినియోగించే వస్తువులు నాశిరకం లేదా సజావుగా లేకపోతే వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి కొనుగోలు చేసిన వస్తువులు, అలాగే పొందిన సేవలు సజావుగా అందకపోతే నష్టం వాటిల్లకుండా పరిష్కారం జరిగే అవకాశం ఉందని తెలుసుకోవాలి.

ఫిర్యాదు చేసి సాయం పొందవచ్చు



నాణ్యత లేని, కల్తీ సరుకుల విక్రయం, ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యం, సేవా లోపం, ఆయా సంస్థల్లో బీమా కంపెనీల క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బంది పెట్టినా ఏదైనా సమస్య ఎదురైతే అమ్మిన, సేవలందించిన, సంస్థల నుంచి పరిష్కారం కాకపోతే వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసి సాయం పొందవచ్చు. ప్రతి ఒక్క కొనుగోలు దారు, వినియోగదారుడు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి. ఆహారం, అవసరాలు, వైద్యం తదితరాలపై నష్టపోతున్నట్లు అనిపిస్తే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు.

– అద్దేపల్లి లక్ష్మీపతిరాజు, న్యాయవాది, పార్వతీపురం

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ రాంబాబు

సీతంపేట: మండలంలోని దోనుబాయిలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నీలో 50 టీమ్‌లు తలపడనున్నాయి. కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, ఎస్సైలు వై.అమ్మన్నరావు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

● విగ్రహం పరిసరాలు శుభ్రం



జోహార్ అంబేడ్కర్ అని నినాదాలు చేస్తున్న స్థానికులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పరిసరాలను స్థానికులు ఆదివారం పరిశుభ్రం చేశారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. తొలుత విగ్రహాన్ని బాగా కడిగి, అక్కడి పరిసరాల్లోని చెత్తాచెదారం ఏరివేసి దూరంగా పారబోశారు. అనంతరం దీపాలు వెలిగించి, భారత మాతాకీ జై.. రాజ్యాంగ నిర్మాతకు జై.. జోహార్ అంబేడ్కర్. అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత నడుకూరు ధూళి కేశ్వరరావు, బోటు అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

విరిగిన రైల్వే గేటు



ఆర్తాం దగ్గరలో విరిగిన రైల్వే గేటు

కొమరాడ: మండంలోని ఆర్తాం గ్రామ సమీపంలోని రైల్వే గేటు ఆదివారం విరిగిపోయింది. దీంతో ఆ దారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కూనేరు నుంచి పార్వతీపురం వైపు వస్తున్న ఓ వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో గేటు విరిగినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. గేటు మేన్ రైల్వే గేటు దాటి వాహనాలు వెళ్లకుండా ఓల్డ్ గేటు అడ్డంగా ఉంచడంతో గేటుకు ఇరువైపులా వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో అందులోని ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గేటు మరమ్మతులు పూర్తయిన తర్వాతే వాహనాల రాకపోకలు జరుగుతాయని రైల్వే సిబ్బంది తెలిపారు.

పాలకొండ రూరల్: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ విశ్వాసకులు





భామిని: బత్తిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసకులు

క్రీస్తుమార్గం అనుసరణీయం..

పాలకొండ రూరల్: ప్రభువైన క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని రెవెరెండ్, ఫాదర్ యేసురత్న రాజ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో క్రైస్తవ విశ్వాసకులతో విశ్వాసమార్గ ర్యాలీ నిర్వహించారు. సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆరాధనా గీతాలు ఆలపించారు. అలాగే స్థానిక లూర్దుమాత ఆర్‌సీఎం చర్చి, షారోన్, బేతేలు, తదితర మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా మట్టల ఆదివారం..

వీరఘట్టం: స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో సండే స్కూల్ టీచర్స్, స్టూడెంట్స్ మట్టల ఆదివారం పండగను ఘనంగా నిర్వహించారు. ఏసు క్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొబ్బరి మట్టలను అందంగా తయారు చేసి వాటితో పట్టణ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిడెంట్ కళింగ ప్రేమభూషణరావు, క్రైస్తవ పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



వీరఘట్టం: మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ భక్తులు

బత్తిలిలో..

భామిని: మండలంలోని బత్తిలిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి భక్తులు ఈత మట్టలను పట్టుకుని పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. చర్చి ఫాదర్ బోగి సంజీవరావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో విశ్వాసకులు, దీక్షాపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం/గుమ్మలక్ష్మీపురం(కురుపాం):

మండలంలోని ఎస్.కె.పాడు, గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, రెల్ల తదితర గ్రామాల్లోని క్రీస్తు ప్రార్థనా మందిరాల వద్ద మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజున ఏసుక్రీస్తు యెరూషలేం పట్టణానికి రాజుగా జయప్రవేశం చేయగా అక్కడి వారంతా వివిధ పుష్పాలతో అలంకరించిన కర్జూరపు మట్టలు చేత పట్టుకుని, వస్త్రాలు నేలపై పరిచి ఘనస్వాగతం పలుకుతారు. ఈ సందర్భం పురస్కరించుకుని, క్రైస్తవులంతా ఈ మట్టల ఆదివారం పండగ చేసుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కర్జూరపు మట్టలు, ఈతకొమ్మలు, కొబ్బరిమట్టలు చేతపట్టి వీధుల్లో ఊరేగుతూ జీసస్ శ్రమలను తలుచుకుని, ఆరాధన గీతాలు ఆలపించారు. యూదుల రాజుకు జేజేలు అని స్వాగతం పలికారు. ఏసుక్రీస్తు లోకరక్షకుడని, కరుణామయుడు, దయామయుడైన ఆయన బోధనలు శాంతి, సమాధానం చేకూరుస్తాయని ఫాదర్‌లు తెలిపారు. కురుపాం మండల కేంద్రంలోని గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి ఫాదర్ డి.రాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండగ ఘనంగా జరిగింది.



కురుపాంలో క్రైస్తవ సోదరుల తిరువీధి

రోడ్డు పనులు సకాలంలో పూర్తిచేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రామస్వామి



అసంపూర్తి రోడ్డు పనుల కారణంగా అవస్థలు పడుతున్న వాహన చోదకులు

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల నుంచి ఎర్రన్నగుడి జంక్షన్ వరకు రహదారి పనులు సకాలంలో పూర్తి చేసి సురక్షితమైన రహదారిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన కమిటీ సభ్యులతో కలిసి అడ్డాపుశీల నుంచి తోటపల్లి రిజర్వాయర్, ఉల్లిభద్ర, ఎర్రన్నగుడి జంక్షన్ వరకు రో డ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా మారగా ఇటీవల పనులు ప్రారంభించి అలసత్వం చేయడంతో వాహన చోదకులకు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందన్నారు. వేగంగా వెవెళ్లే భారీ వాహనాల కారణంగా దట్టంగా ధూళి పైకి లేచి ప్రజా రవాణాకు సంబంధించిన వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు.